క్లుప్తంగా

నేడు నున్నలో ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ పర్యటన

నున్న(విజయవాడరూరల్): గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం నున్న గ్రామంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటలకు బోడ పాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి పార్టీ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నున్న ఇందిరా కాలనీలో గడప గడపకు ఎన్నికల ప్రచార కార్యక్రమానికి వంశీ శ్రీకారం చుడతారు. పర్యటనలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, గృహసారధులు, కార్యకర్తలు పాల్గొంటారని చంద్రారెడ్డి తెలియజేశారు.

పెనమలూరు నుంచే పోటీ
మంత్రి జోగి రమేష్

పెనమలూరు: తాను పెనమలూరు నియోజకవర్గం నుంచే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. గంగూరు పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో తాను ఇక్కడి నుంచి కాకుండా మైలవరం నుంచి పోటీ చేస్తున్నట్లు వచ్చిన వార్తను తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను ఎంతగానో నమ్మి పెనమలూరు నుంచి పోటీ చేయడానికి నిర్ణయించారన్నారు. అయితే పెనమలూరులో ప్రజల నుంచి తనకు వస్తున్న ఆదరణ చూడలేక కావాలనే ప్రజల్లో లేనిపోని ఊహలు రేకెత్తించడానికి ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజల అండదండతో పెనమలూరులో ఘన విజయం సాధించి జగనన్నకు గిఫ్ట్ ఇస్తానని తెలిపారు.

ఎన్నికల నిబంధనల అతిక్రమణపై ఫిర్యాదు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించి పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయడంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి గురువారం వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు శీలం రంగారావు ఫిర్యాదు చేశారు. రామవరప్పాడు రాజుల బజారు, పొట్టి శ్రీరాముల కాలనీ, ఎనికేపాడు కానూరు రోడ్డులో జీసస్ మిరాకిల్ చర్చి ఎదురుగా, ప్రసాదంపాడు, నిడమానూరు సాయిబాబా ఆలయ వీధిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యాలయాల్లో పెద్ద పెద్ద హోర్డింగులు, పార్టీల రంగుల ప్రదర్శన, జెండాలు, సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి నిబంధనలు అతిక్రమించారని వీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కానూరులో వ్యక్తి అదృశ్యంపై కేసు

పెనమలూరు: కానూరులో వ్యక్తి అదృశ్యంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కానూరు మురళీ నగర్‌కు చెందిన నందిగం తవుడు కుమారుడు సాయి కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. కాగా గత నెల 25వ తేదీన సాయి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువుల వద్ద, విజయవాడ పరిసర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి తవుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైశాకి వేడుకల్లో సిక్కుల తలపాగా



లబ్బీపేట(విజయవాడతూర్పు): సిక్కులకు పవిత్రమైన వైశాకి పర్వదిన వేడుకలు లబ్బీపేటలోని ఓ షాపింగ్ మాల్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన టర్బన్ అప్‌లో భాగంగా సిక్కుల మత ఆచారమైన తలపాగాను షాపింగ్ మాల్‌కి వచ్చిన సందర్శకులకు కట్టి పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. గ్లోబల్ సిక్కస్ సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జ్ కరమ్ కౌర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గురుగోబింద్ సింగ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కుల్దీప్ కౌర్, కార్యదర్శి హరవిందర్ సింగ్ పాల్గొన్నారు. తెలుగు ప్రజలు ఉగాది పర్వదినం ఎంత పవిత్రమైనదో.. సిక్కులకు వైశాఖి పండుగ అంతే పవిత్రమైనదని ఈ సందర్భంగా వారు తెలిపారు.

శివకామేశ్వరికి తమలపాకులతో అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో గురువారం వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన అమ్మవారికి తమలపాకులతో అర్చన జరిగింది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు మంత్రి జోగి రమేష్ శుభాకాంక్షలు

పెనమలూరు: మండల పరిధిలో రంజాన్ పండుగను గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పలు గ్రామాల్లో మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ తర్వాత ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఉదయాన్నే ముస్లింలు మసీదు, ఈద్గాలకు రాగా ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఆయా మసీదు కమిటీలు ఏర్పాట్లు చేశారు. మత గురువులు నమాజ్ చేసి అల్లా విశిష్టతను, రంజాన్ గొప్పతనాన్ని వివరించారు.

పి.నైనవరం(విజయవాడరూరల్): పవిత్ర రంజాన్ పండుగను గురువారం గ్రామాల్లోని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకొన్నారు. పి.నైనవరం గ్రామం ఈద్గాలో జరిగిన ప్రార్థనలో మత గురువు ఎండీ సాహెద్ తన ప్రసంగంలో పేదలకు సాయం చేయడమే రంజాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ప్రార్థనల్లో అంబాపురం గ్రామ ముస్లింలు కూడా పాల్గొన్నారు. నున్న గ్రామంలో ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

గన్నవరం: రంజాన్ వేడుకలను గన్నవరం ప్రాంతంలోని ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కేసరపల్లి శివారు దుర్గాపురంలోని ఈద్గా వద్ద గన్నవరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్ మిలాన్ నిర్వహించారు. మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దావాజిగూడెంలోని పామర్తినగర్‌లో మసీదు కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి.

గన్నవరం రూరల్: క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసమని ముస్తాబాద జామియా మసీద్ ఇమాం హసీన్‌ఇక్బాల్ సందేశమిచ్చారు. గురువారం స్థానిక ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో దివ్య ఖురాన్ అవతరించిందని చెప్పారు. ముస్తాబాద, సూరంపల్లి, సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



యనమలకుదురులో నమాజ్ అనంతరం మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని మసీదుల్లో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎనికేపాడులోని మజ్జిద్ ఈ మహ్మదీయ మసీదులో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. మసీదు ప్రెసిడెంట్ షేక్ నూరుద్దీన్ సాహెబ్, వైస్ ప్రెసిడెంట్ షేక్ ఖాలేషావలి సాహెబ్, సెక్రటరీ సయ్యద్ రషీద్ సాహెబ్, సయ్యద్ మస్తాన్‌లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

రంజాన్ అత్యంత పవిత్రమైనది: మంత్రి జోగి రమేష్

రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగ అని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. కానూరు సనత్‌నగర్, యనమలకుదురు ప్రాంతాల్లో రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రతీ ముస్లింకు అల్లా దయతో మంచి జరగాలని కోరారు. ఈద్గాకు వచ్చే ఏడాదిలో స్థలం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరులోని ఈద్గా మైదానంలో గురువారం రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదుతో పాటు పలు మసీదుల వద్ద ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పెద ఓగిరాల మసీదులోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ అర్షతున్నీసా బేగం, కౌన్సిలర్ బేగ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు అబ్దుల్‌సద్దాం, గఫూర్, సలీమ్ బేగ్, షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గురువారం రంజాన్ సందర్భంగా గోసాల ఎస్‌జీఎస్ కల్యాణ మండపం, కంకిపాడు ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: రంజాన్ సందర్భంగా గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలుచోట్ల హిందూ, ముస్లింలు ఈద్ ముబారక్ తెలుపుతూ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ గ్రంథం అవతరించిన రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ నెలలో కఠిన ఉపవాస దీక్షలు పాటించడంతో పాటు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వ గుణాలు అలవర్చుకోవాలని ఇమామ్ తెలిపారు. మదీన మసీద్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి పాల్గొన్నారు.



దుర్గాపురం ఈద్గాలో జరిగిన ప్రార్థనలో ముస్లిం సోదరులు



ఎనికేపాడులో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం మత పెద్దలు



ఉయ్యూరులోని ఈద్గా మైదానం ప్రార్థనల్లో ముస్లింలు

సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలి



వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపిన మత్స్య సంఘంతో వెంకయ్య, సురేష్

గన్నవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పేదలు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరగనుందని, ఈ సంగ్రామంలో పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలో గురువారం మత్స్యకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ అధ్యక్షతన దళిత మత్స్య సొసైటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ అభివృద్ధి అంటే రోడ్లు, డ్రైయిన్లు, భవనాలు నిర్మించడమే కాదన్నారు. అట్టడుగున ఉన్న పేద వర్గాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చి వారి ఆర్థికాభ్యున్నతికి బాటలు వేయడమని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు విద్య, వైద్యం పరంగా మెరుగైన సదుపాయలను కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పేదలకు వల్లభనేని వంశీమోహన్ అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారని అన్నారు. మత్స్యకార సంఘ సభ్యులకు సహకారం అందించడంతో పాటు సొసైటీ భవన నిర్మాణానికి కృషి చేశారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో వంశీమోహన్ విజయానికి సంఘ సభ్యులందరూ సమిష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీకి చెందిన తిరివీధి రంగారావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు పాలిమేర పేతురు, సంయుక్త కార్యదర్శి తిరివీధి నానిబాబు, వార్డు సభ్యులు నిడమర్తి రాంబాబు, సొసైటీ కార్యదర్శి రంగారావు, నల్లమోతు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

మంత్రి జోగి రమేష్

పెనమలూరు: సమాజానికి ఎంతో సేవ చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. గంగూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ దోపిడి, వివక్షతను ఎదుర్కొవడానికి విద్య చాలా అవసరమని ప్రజలను జ్యోతిరావు పూలే చైతన్యం చేశారన్నారు. ప్రజలకు సాంఘిక న్యాయం, సమాన హక్కుల కోసం పోరాటం చేసి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నున్న బాలికల హాస్టల్‌లో..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. బలహీన వర్గాల ప్రజలు విద్యావంతులు కావాలని, వారి కోసం కృషి చేసిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐసా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి శివ, నగర అధ్యక్షుడు విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

కంకిపాడు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని ప్రజాపోరాట సమితి వ్యవస్థాపకుడు ముప్పల అన్వేష్ అన్నారు. కంకిపాడులోని సమితి కార్యాలయంలో పూలే జయంతిని గురువారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్వేష్ మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. సమితి నియోజకవర్గ అధ్యక్షుడు వీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు బీ నాగరాజు, ఎస్ చిట్టిబాబు, నాయకులు రోహిత్, అనిల్, దినేష్, రవి, సాయిరామ్, అంజిబాబు పాల్గొన్నారు.



గంగూరులో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్

గన్నవరం: స్థానిక సినిమా హాల్ సెంటర్, బుద్ధవరం బస్‌స్టాప్ వద్ద గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. పూలే చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి కర్ర వరప్రసాదరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూర్మాల సత్యశ్రీనివాస కుమార్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. కోశాధికారి పి.రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి వీ ప్రసాదరావు, కమిటీ సభ్యులు శేఖర్, రాధిక, వీ విజయకుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో మహాత్మ పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి సాయి గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వి.డి.ఎస్. ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొకినాల సాంబశివరావు, బీజేపీ మండల అధ్యక్షుడు జింక నలగామరాజు పాల్గొన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని విద్యుత్ రెవిన్యూ కార్యాలయంలోనూ ఏపీసీపీడీసీఎల్ ఉద్యోగుల ఆధ్వర్యాన పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జేఏఓ టి.ప్రసాద్, ఉద్యోగ సంఘం నాయకులు కే నాగేశ్వరరావు, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పలువురు లైన్‌మెన్లు పాల్గొన్నారు.



నున్న బాలికల హాస్టల్‌లో పూలే చిత్రపటానికి నివాళులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాపోరాట సమితి ప్రతినిధులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మానవత సంస్థ సభ్యులు

సీఎం జగన్‌ను గెలిపించడానికి సిద్ధం

ఉంగుటూరు: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమాన్ని అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో సీఎం జగనన్న ప్రజలకు చేసిన మంచిని వివరించారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. తేలప్రోలులో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, మానికొండలో వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఆత్కూరులో మాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, ప్రసాద్, చంటి, ఆశీర్వాదం, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎం జగన్‌కే పట్టం కట్టాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మల్లవల్లిలో జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఉమామహేశ్వరపురంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు నేతృత్వంలో, దంటగుంట్లలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, పార్టీ బీసీ నాయకుడు కురుముని శ్రీనివాసరావు నేతృత్వంలోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరవల్లిలో గూడవల్లి రత్నసుధాకర్, కోడెబోయిన బాబి, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లిలో చెరుకూరి శ్రీనివాస్, తిప్పనగుంటలో పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను గెలిపించుకునేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. వృద్ధులకు ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటికి వచ్చి వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేశారని చెప్పారు. మన బడి నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, డిజిటల్ క్లాస్ రూంలు, ట్యాబ్‌లు, టాయిలెట్లు వంటి సౌకర్యాలు పేద విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సొంతిల్లు లేని నిరుపేదల కోసం కొత్త ఊళ్లు నిర్మిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు లబ్ధిదారులు అండగా ఉండాలని కోరారు.



ఆత్కూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



దంటగుంట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల అధ్యక్షుడు గాంధీ, ప్రజాప్రతినిధులు



వీరవల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గాయకుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల్లో ప్రతిభను ప్రోత్సహించాలని మహీస్వరాలు సాంస్కృతిక వేదిక అధ్యక్షురాలు మహేశ్వరి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ సంగీత విభావరి, ఏకగళ విభావరి గాయకుడు శేషగిరిరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరి మాట్లాడుతూ.. గాయకులు తమకంటూ ప్రత్యేక బాణీని అలవర్చుకోవాలని సూచించారు. గాయకుడు శేషగిరిరావు, పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు శేషగిరిరావును ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు లక్ష్మి, అమృతవల్లి, మల్లీశ్వరి, పద్మశ్రీ, భాను సహస్ర, చింతకాయల చిట్టిబాబు, బి.వి.వీరభద్రరావు పాల్గొన్నారు.



గాయకుడు శేషగిరిరావును సత్కరిస్తున్న మహేశ్వరి, వీరభద్రరావు తదితరులు

పెనమలూరులో బైక్ చోరీ

పెనమలూరు: పెనమలూరులో బైక్ చోరీ ఘటనపై క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు నవత రోడ్డుకు చెందిన మోతుకూరి ఆదిశేషు బట్టల కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతను పెనమలూరులో ఒక చికెన్ షాపు వద్ద బైక్ ఉంచి వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తిని కలవడానికి వెళ్లి గంట తర్వాత వచ్చాడు. అయితే అతను పార్కు చేసిన బైక్ కనిపించలేదు. దీంతో బైక్ చోరీ అయిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు ఐఐటీ, జేఈఈపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తో పాటు ఐఐటీ, జేఈఈకి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై శరత్‌చంద్ర ఐఐటీ అకాడమీ, శరత్‌చంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఎంజీరోడ్డులోని తమ అకాడమీలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఐఐటీ, జేఈఈకి ఎలా ప్రిపేర్‌అవ్వాలి, ఏ పుస్తకాలు చదవాలి, ఏ టాపిక్స్ ఎక్కువగా ఫోకస్ చేయాలనే అంశాలపై ఆల్ ఇండియా ఆరో ర్యాంకు సాధించిన కార్తికేయ వివరిస్తారని, విద్యార్థులు సైతం సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకూ ఈ సదస్సు జరుగుతుందన్నారు.

శ్రీమద్రామాయణం నిత్యనూతన మహాకావ్యం

విజయవాడ కల్చరల్: శ్రీమద్రామాయణం నిత్యనూతన కావ్యమని ఆధ్యాత్మికవేత్త మండలీక శ్రీకృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీమద్రామాయణ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. గురువారం శ్రీ రాముడు ధర్మ స్వరూపుడు అంశంగా మండలీక శ్రీకృష్ణకుమార్ ప్రసంగించారు. శ్రీ మద్రామాయణ కథా కేవలం పురాణం కాదన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవం రామాయణంలో కనిపిస్తుందన్నారు. ఏ దేశానికైనా, ఏ ప్రాంతానికైనా, ఏ కాలానికైనా సమాజానికి అవసరమైన అంశాలు రామాయణంలో కనిపిస్తాయని వివరించారు. శ్రీరాముడి ఏక పత్నీవ్రతం, సత్యవాక్ పాలన, దుష్టశిక్షణ రామాయణంలో కనిపిస్తాయని, ప్రజారంజక పాలనను రామరాజ్యంలో పోలుస్తారని పేర్కొన్నారు. నేటి సమాజానికి రామరాజ్యం అవసరమన్నారు. ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.



రంజింప చేసిన నవ దుర్గ నృత్యరూపకం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం సాయంత్రం కూచిపూడికి చెందిన చింతా రవి బాలకృష్ణ కళాబృందం ప్రదర్శించిన నవ దుర్గ నృత్యరూపకం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ధర్మపథం వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మూడో రోజైన గురువారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ పురస్కార్ గ్రహీత చింతా రవి బాలకృష్ణ బృందం ప్రదర్శించిన నృత్య రూపకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు తరలివచ్చారు. కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో లయబద్ధంగా నృత్య రూపకాన్ని ప్రదర్శించగా, భక్తులు ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఓ రామరావు వారిని సత్కరించి ప్రసాదాలను అందజేశారు.



ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్ హెచ్‌ఎం డి.మోహన్ సూచించారు. కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు గురువారం గణితం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఉచితంగా కోచింగ్ తీసుకొని మంచి ర్యాంకులు సాధించిన వారు అనేక మంది ఉన్నారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ విద్యార్థులను అభినందించారు.